ప్రజాశక్తి
శుక్రవారం 30 జూన్ 2023
5
కర్నూలు

ఎఫ్‌పిపిసిఎ బాదుడు...

- ఒక్క నెలలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.8.97 కోట్లు - యూనిట్‌పై 40 పైసల భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో వివిధ పేర్లతో సామాన్యులపై బాదుడు వేసింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో ఈనెల నుంచి సామాన్యులపై విద్యుత్ బిల్లులో భారాన్ని మోపింది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. గతేడాది ఆగస్టు నుంచే తొలి విడత ట్రూ అప్ చార్జీలను వసూలు చేస్తుండగా ఈనెల నుంచి రెండో విడత ట్రూ అప్ చార్జీలను వసూలు చేస్తుండడంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారునికి అదనపు భారంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఒక్క నెలలోనే రూ.8.97 కోట్ల రూపంలో ఎఫ్‌పిపిసిఎ భారం వేసింది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 14,26,915 విద్యుత్ కనెక్షన్లు ఉండగా యూనిట్‌పై 40 పైసల చొప్పున భారాన్ని మోపింది. 11,19,459 గృహ విద్యుత్ (ఎల్‌టి1) కనెక్షన్లు ఉండగా వాటిపై ఎఫ్‌పిపిసిఎ రూపంలో రూ.6.32 కోట్లు జూన్ నెల బిల్లులో వేశారు. 1,25,378 వాణిజ్య (ఎల్‌టి2) కనెక్షన్లు ఉండగా వాటికి రూ.1.13 లక్షలు, 7,630 పారిశ్రామిక (ఎల్‌టి3) కనెక్షన్లు ఉండగా వాటికి రూ.67.09 లక్షలు, 23,370 సాధారణ ప్రభుత్వ (ఎల్‌టి4) కనెక్షన్లు ఉండగా వాటిపై రూ.79.93 లక్షలు ఎఫ్‌పిపిసిఎ రూపంలో భారం పడింది. మరో వైపు ట్రూ అప్ రూపంలోనూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.3.43 కోట్లు విద్యుత్ వినియోగదారులపై భారం పడింది. గృహ వినియోగదారులపై రూ.2.31 కోట్లు, వాణిజ్య వినియోగదారులపై రూ.45లక్షలు, పారిశ్రామిక వినియోగదారులపై రూ.33.81 లక్షలు, ప్రభుత్వ సంస్థలపై రూ.31.69 లక్షలు ట్రూఅప్ భారం పడింది.

ప్రజలందరినీ కూడగట్టి ఆందోళనలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపైన విద్యుత్ భారాలు విపరీతంగా మోపుతోంది. పెరిగిన విద్యుత్ బిల్లుల వల్ల ఎవరికి చెప్పుకోవాలో తెలీని పరిస్థితిలో ఉన్నారు. ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్, సర్‌ఛార్జ్ వంటి వేరు వేరు పేర్లతో సామాన్యులపై భారాలు వేస్తున్నారు. దాంతో పాటు కేంద్రానికి తలొగ్గి స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు పూనుకుంటున్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలందరినీ కూడగట్టి ఆందోళనలు చేపడతాం.

- ఇ.పుల్లారెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు.

ఉద్యోగాల పేరుతో మోసం చేస్తే
కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగాలు ఇప్పిస్తామని, చెప్పి డబ్బులు వసూలు చేసి, మోసాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తులను నమ్మవద్దని, డబ్బు ఇస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలు చేసే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికీ డబ్బు ఇవ్వొద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలో ఏ రిక్రూట్మెంట్ అయినా నోటిఫికేషన్ ద్వారా పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేస్తామన్నారు. కలెక్టర్ పేరు చెప్పి ఖజానా శాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇప్పిస్తామని మోసం చేస్తున్న కర్నూలు నగరానికి చెందిన బి.క్యాంపు నివాసి వైడూర్య అనే మహిళపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. డబ్బు వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి రావడంతో ఆమె పై కేసు నమోదు చేయాల్సిందిగా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సృజన

1 నుంచి 'జగనన్న సురక్ష' క్యాంపు

- ఏర్పాట్లకు స్పెషల్ సెక్రెటరీ పూనం మాలకొండయ్య ఆదేశం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

జగనన్న సురక్ష మొదటి క్యాంపును జులై ఒకటో తేదీ నుండి విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాల కొండయ్య ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి వారికి ఉన్న సమస్యలకు టోకెన్ రైజ్ చేసి అందుకు సర్వీస్ రిక్వెస్ట్ రైజ్ చేసి పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. జూలై 1 నుంచి జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నారని అందుకు మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్యాంపుల నిర్వహణలో ఎటువంటి సాంకేతిక లోటుపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి భరత్ గుప్తా మాట్లాడుతూ వచ్చిన టోకెన్లకు సరైన సర్వీస్ రిక్వెస్టులు ఇచ్చి వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. జగనన్న సురక్షకు సంబంధించి ఎక్కడైతే క్యాంపులు నిర్వహిస్తారో సదరు వివరాలను ముందస్తుగానే గ్రామాల్లోని ప్రజలకు తెలిసి క్యాంపును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. క్యాంపులలో సరైన రీతిలో కంప్యూటర్లు, స్కానర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జగనన్న సురక్షకు సంబంధించిన హోలోగ్రామ్స్‌ను ప్రతి జిల్లాకు పంపిణీ చేస్తామన్నారు. క్యాంపుల నిర్వహణలో అధికారులు ప్రజల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, అన్ని జిల్లా కలెక్టర్లకు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై అదనపు భారం రద్దు చేయాలి

- పిపిఎస్ఎస్ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కరోనా నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలపై విద్యుత్ శాఖ విధించిన ఎసిడిని రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం విద్యుత్ శాఖ ఎస్ఇకి వినతి పత్రం ఇచ్చింది. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, నగర నాయకులు కె.గోపీనాథ్ మాట్లాడుతూ ఇప్పటికే డెవలప్‌మెంట్ చార్జీ, ట్రూ అఫ్ చార్జీ పేరుతో వినియోగదారులపై భారం వేశారన్నారు. మళ్లీ కరెంటు చార్జీపై 100శాతంపైగా ఎసిడితో బిల్లులిచ్చారని, మొత్తం చెల్లిస్తేనే కరెంటు బిల్లులు సేకరిస్తామని వినియోగదారులను వెనక్కి పంపుతున్నారని విమర్శించారు. బక్రీద్ పండుగపై కూడా రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపడం లేదని విమర్శించారు. 8311201195421 సర్వీసుగల నివాస భవనానికి రూ.21432 కరెంటు బిల్లు వస్తే దానిపై 31,850 ఎసిడి బిల్లు కలిపి కరెంటు బిల్లు వచ్చిందని ఉదాహరణగా తెలిపారు. కరెంటు బిల్లుతోపాటు ఎసిడి చెల్లిస్తే తప్ప ఫోన్‌పే ఆన్‌లైన్ చెల్లింపులు స్వీకరించకపోవడం ఇదెక్కడి న్యాయమని ఎస్ఇని ప్రశ్నించారు. ఎస్ఇ మాట్లాడుతూ ఎసిడి రద్దు చేయడం నా పరిధిలో లేదని మీ అర్జీని ప్రభుత్వానికి పంపుతానన్నారు. 15 రోజులకు చెల్లిస్తామని రాసి ఇస్తే ఎసిడి చెల్లింపునకు సమయం ఇస్తామని అన్నారు. విద్యుత్ భారాలు రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఇని కలిసిన ప్రతినిధి బందంలో ఎన్.మదిలేటి, ఎండిజె. బాషా, ఎస్.షాకీర్ ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కర్నూలులో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమయ్యే స్థలాన్ని గుర్తించాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య ఆదేశించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) ప్రాజెక్టు జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) ప్రాజెక్టు జిల్లా స్థాయి కమిటీ సభ్యులు ప్రాజెక్టు నిర్వహణకు సహాయ సహకారాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఐఒసిఎల్ జనరల్ మేనేజర్ జివి సత్యనారాయణ నేతృత్వంలో కర్నూలులో సిజిడి ప్రాజెక్టుపై క్లుప్త ప్రదర్శన ఇస్తూ ఎల్ఎన్‌జి హబ్, డిఆర్ఎస్ స్థలాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వివిధ అనుమతుల స్థితిగతులను జాయింట్ కలెక్టర్‌కు తెలిపారు. ఎల్ఎన్‌జి హబ్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ, కర్నూల్ ఆర్‌డిఒలు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆచార్యులు, మునిసిపల్ అధికారులు, రహదారులు , భవనాల శాఖ, తహశీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి, సబ్ కలెక్టర్

ఘనంగా బక్రీద్ వేడుకలు...

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా వ్యాప్తంగా బక్రీదు పండుగను ఈద్గాలలో, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఘనంగా జరుపుకున్నారు. కర్నూలు నగరంలో గురువారం బక్రీదు పండుగ పురస్కరించుకొని వివిధ ఈద్గాలలో మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాత ఈద్గాలో సలీంబాషాఖాద్రి, సయ్యద్ భాషాఖాద్రి, సంతోష్ నగర్‌లో జిబిఆర్ మౌలానా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రసంగించారు. ఈ ప్రాంతంలో సంతోష్ నగర్‌లో కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హాఫీస్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి. మోహన్ రెడ్డి, టిడిపి ఇన్‌చార్జి టిజి. భరత్ తదితరులు ఈ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. కర్నూల్ నగరంలోని ప్రజలందరూ కలిసిమెలిసి ఐకమత్యంగా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

కర్నూలు హాస్పిటల్ : కర్నూలులో ముస్లింలు సోదరులందరూ బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నట్లు కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జీ టిజి భరత్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా కర్నూలు నగరంలోని పాత ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో టిజి భరత్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

సి బెళగల్ : మండలంలోని అన్నీ గ్రామాల్లో ముస్లిలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. మండలంలో 13 మసీదులు ఉండగా నూతన వస్త్రాలు ధరించి మానవాళి శ్రేయస్సుకోసం శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు అలింగణం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

తుగ్గలి: తుగ్గలి, రాతన, పెండేకల్లు ఆర్‌ఎస్.రాంపురం కొట్టాల, హుస్సేనాపురం, జొన్నగిరి, రాంపల్లి ఎర్రగుడి, బొందిమడుగుల, చెన్నంపల్లి తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కో ఆప్షన్స్ సభ్యులు చాంద్‌బాషా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, మండల కార్యదర్శి సుల్తాన్, రాంపురం సర్పంచి షేక్ లడ్డుకమల్ బాష, చెన్నంపల్లి మహబూబ్ బాషా, సుభాన్, రంజాన్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న టిజి.భరత్ తదితరులు

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎస్‌వి మోహన్‌రెడ్డి

ఇంటర్‌లో ప్రవేశం కల్పించిన నిర్మలతో కలెక్టర్ సృజన, డాక్టర్ వేణుగోపాల్

బడి బయట విద్యార్థినికి ఇంటర్లో ప్రవేశం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదవ తరగతిలో అధిక మార్కులు సాధించి ఇంటి వద్దనే ఉన్న ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన బడి బయట విద్యార్థిని ఎస్.నిర్మలకు పాఠశాలలో ప్రవేశం కల్పించాలని జిల్లా కలెక్టర్ సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. ఆస్పరి కెజిబివిలో బైపిసి గ్రూపులో ఇంటర్ ప్రవేశానికి అడ్మిషన్ కల్పిస్తున్నట్లు ఎపిసి డాక్టర్ కె.వేణుగోపాల్ వెల్లడించారు.

వైఎస్ఆర్ పెన్షన్ కానుకకు రూ.65.83 కోట్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జులై మాసానికి వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద లబ్ధిదారులకు అందజేసే పెన్షన్‌కు రూ.65.83 కోట్ల నిధులు విడుదల అయినట్లు డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య వెల్లడించారు. కర్నూలు జిల్లాలో మొత్తం 2,36,767 మంది లబ్ధిదారులకు పెన్షన్ కానుక కింద లబ్ధి చేకూరుతుందన్నారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రేమ విఫలమైందని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని మూడో పట్టణ సిఐ మురళీధర్ రెడ్డి తెలిపారు. సిఐ కథనం మేరకు నగరంలోని బి క్యాంపు పోస్ట్ ఆఫీస్ సమీప కొట్టాలలో నివాసం ఉంటున్న బోయ మధు (25) ఓ యువతిని ప్రేమించాడు. యువతి అతని ప్రేమను తిరస్కరించడంతో యువకుడు మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి తన ఇంటి పక్కన ఉన్న ఓ కొట్టంలో ఇనుప పైపులకు దుప్పటితో ఉరేసుకుని చనిపోయినట్లు సిఐ పేర్కొన్నారు. మృతుని తమ్ముడు బోయ విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

పంటల బీమా కింద రూ.10 .86 కోట్లు : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

గతేడాది ఖరీఫ్‌లో పత్తి, వేరుశనగ, జొన్న, ఉల్లి పంటలు నష్టపోయిన రైతులకు గాను ప్రభుత్వం మండలానికి రూ.10 కోట్ల,86 లక్షల 15 వేల 615 మంజూరు చేసిందని ఎఒ మల్లేష్ కుమార్ గురువారం తెలిపారు. నేడు అన్నీ భరోసా కేంద్రాలలో అన్నీ సచివాలయలలో రైతులకు బీమా జాబితా వెల్లడిస్తామని తప్పొప్పులు ఉంటే వ్యవసాయసిబ్బందిని సంప్రదించాలని అన్నారు.

నేడు విద్యుత్ భవన్ వద్ద ధర్నా

సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 30న విద్యుత్ భవన్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. కర్నూలు 23వ వార్డు శ్రీరాంనగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ కరపత్రాల పంపిణీ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు పెరిగిన కరెంటు చార్జీల గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడుదొంగల వలె కరెంటు చార్జీలు పెంచి ప్రజలకు షాకు ఇస్తున్నారన్నారు. గతేడాది కరెంటు చార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపిందన్నారు. స్లాబులు మార్చేశారు ప్రజల కళ్ళుగప్పి గత 15 ఏళ్ల నుంచి వాడుకున్న కరెంటు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల పైన తాజాగా రూ.6000 కోట్ల భారం వేశారన్నారు. జగన్ ప్రభుత్వం పాలించిన ఈ నాలుగు సంవత్సరాల కాలంలో రూ.25 వేల కోట్ల భారాలు ప్రజల పైన మోపారన్నారు. ఈనెల బిల్లులో 2014సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్ళీ యూనిట్ పై 20 పైసలు, 2021 మే నెలలో వాడిన విద్యుత్ యూనిట్‌కు మరో 20 పైసలు, 2023 ఏప్రిల్ నెలలో ఉపయోగించిన కరెంటుకు యూనిట్‌కు 40 పైసలు కలిపి మొత్తం యూనిట్‌కు రూ. 80 పైసలు చొప్పున జనం నెత్తిన బండ వేశారన్నారు. గతంలో సోలార్ విద్యుత్ యూనిట్ రూ.12 ఉండగా ఇప్పుడు ఉత్పత్తి ఖర్చు తగ్గి రూ. రెండు రేటు పడిపోయిందన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గిందని, కరెంటు చార్జీలు తగ్గాలి, ఆ విధంగా కాకుండా కరెంటు చార్జీలు పెంచుతున్నారన్నారు. ఈనెల 30న విద్యుత్ భవన్ కొత్త బస్టాండ్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాలో ప్రజలందరు పాల్గొనాలని కోరారు.

23వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు నరసింహులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం : శ్రీ దేవి

ప్రజాశక్తి- పత్తికొండ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నామని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు.గురువారం పత్తికొండ వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో సచివాలయం కన్వీనర్లు,గ్రామ నాయకులు, గృహ సారథులతో పత్తికొండ ఎమ్మెల్యేకంగాటి శ్రీదేవి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ జులై ఒకటో తేదీ నుంచి ప్రతి సచివాలయంలో జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. మీ గ్రామ సచివాలయంలో సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరి సమస్యను నమోదు చేసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, మరణ, జనన, పొలం పట్టాదారు పాసు పుస్తకాలు, వివాహ ధృవీకరణ పత్రం ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, హౌస్ ఓల్డ్ మ్యాపింగ్, కొత్త రేషన్ కార్డులు, మార్పులు చేర్పులు వీటన్నిటికి సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్న మీరు ముందుగా గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. ఎంపిపి నారాయణ దాసు, దేవనబండ సర్పంచి ప్రమీల, మండల కన్వీనర్ కారం నాగరాజు, శ్రీరంగడు, ఎంపిటిసి నీలకంఠ, పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : కాటసాని

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 28వ వార్డు బి ఆర్ రెడ్డి కాలనిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలోని ప్రతి గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డ్ కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివశంకర్ రెడ్డి, కార్పొరేటర్ , స్టాండింగ్ కమిటి మెంబర్ సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, కాశపోగు జయరాముడు, విక్రమసింహ రెడ్డి, మైతాపు నరసింహులు, తిరుపాల్, వైజా బాలచంద్ర రెడ్డి, కల్లూరు మండల జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి, కర్నూలు జిల్లా కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, కర్నూలు నగర మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, సల్కాపురం సర్పంచి మద్దిలేటి, పెద్దపాడు శ్రీధర్ రెడ్డి, వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి మిడుతూరు శ్రీనివాసులు యాదవ్, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతు రెడ్డి, పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి సెల్ శివ సందేపోగు తదితరులు పాల్గొన్నారు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నాసిరకం పనులు చేసిన హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ నుండి తెలంగాణ జిల్లా చంచల్‌గూడా వరకు వేసిన హెచ్‌పిసిఎల్ గ్యాస్ పైప్ లైన్ నాసిరకంగా పనులు చేసినట్లు రైతులు వాపోతున్నారని అన్నారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో ప్రారంభమై జి.సింగవరం దగ్గర ముగుస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో వేసిన పైపులైను మెత్తనిమట్టితో ఇసుకతో కాకుండా రాళ్లతో నింపినట్లు కొన్ని చోట్ల వాగు వచ్చి కోతలు కోయడం వలన పైపులైను బయటకు వస్తుందని, వీటితో పైప్ లైన్ లీక్ అయితే ప్రజలు ప్రమాదాలకు గురవుతారని అన్నారు. నాసిరకం పనులు చేసిన వాటిపై సమగ్రంగా విచారణ చేసి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలని హెచ్‌పిసిఎల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అందరికీ నష్టపరిహారం ఇవ్వకపోతే మరొకసారి రైతులను కూడగట్టి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న టిడిపి కర్నూలు ఇంచార్జి టీజీ భరత్

పేదల భవిష్యత్తుకు టిడిపి భరోసా

టిడిపి కర్నూలు ఇంచార్జి టీజీ భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : పేదల భవిష్యత్తు బాగుండాలంటే టిడిపి అధికారంలోకి రావాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టిజి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 45 వ వార్డు లేబర్ కాలనీలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలను కలిశారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు అందించి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామన్నారు. కార్మికుల సమస్యలు టిడిపితోనే పరిష్కారం అవుతాయన్నారు. కర్నూలులో పరిశ్రమలు వస్తే స్థానికంగా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, కర్నూలులో తాను ఎమ్మెల్యే అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే టిడిపిని తప్పకుండా గెలిపించాలని ప్రజలను కోరారు. ఇక ప్రజల కోసం ఉచిత వైద్య పరీక్షలు చెపిస్తున్నట్లు భరత్ చెప్పారు. రూ. 3వేలు విలువ చేసే పరీక్షలు ఉచితంగా చెపిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాణిక్యమ్మ, టిడిపి నేతలు, సుంకన్న, ప్రభాకర్, రమణ, లక్ష్మన్న, రవి, సుందర రాజు పాల్గొన్నారు.

పంట బీమా పరిహారమందేనా..?

- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం - ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

ప్రజాశక్తి - హోళగుంద

గతేడాది అధిక వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు బీమా పరిహారమందుతుందా లేదా అని రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం దీనిపై ఎలాంటి స్పష్టతా ఇవ్వడం లేదు. గతేడాది అధిక వర్షాల వల్ల పత్తి, మిరప, వేరుశనగ, వరి, కంది తదితర పంటలు పూర్తిగా నష్టాలనే మిగిల్చాయి. ప్రతేడాది అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి పంటల బీమా పరిహారం అందజేయాల్సి ఉంది.

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 1,538 హెక్టార్లలో పత్తి, మిరప, వేరుశనగ, వరి, కంది పంటలను రైతులు సాగు చేశారు. అలాగే రబీ సీజన్‌లో 3,016 హెక్టార్లలో జొన్న, కొర్రలు, శనగ, వరి తదితర పంటలు సాగు చేశారు. ఖరీఫ్, రబీ సీజన్ రెండు కలిపి 18,354 హెక్టార్లలో సాగు జరిగింది. దాదాపు 12,832 మంది రైతులు ఉన్నారు. ప్రతి రైతుకూ పంటల బీమాను ఇన్స్యూరెన్స్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. గతేడాది పంటల బీమా పరిహారం పైకం జూన్‌లో తమ ఖాతాలో జమ అయినట్లు రైతులు పేర్కొంటున్నారు.

పంట బీమా పరిహారంపై లేని స్పష్టత

గతేడాది పంట బీమా పరిహారంపై స్పష్టమైన సమాచారం తమ దగ్గర లేదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఏ పంటకు ఎంత బీమా చెల్లిస్తారు, పంట బీమా జాబితా కూడా తమ దగ్గర లేదని చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో అడిగిన డేటాను సీజన్ పూర్తి కాగానే ప్రభుత్వానికి చేరవేస్తామని పేర్కొంటున్నారు. రబీ సీజన్ పూర్తి కాగానే పంట వివరాలు, పంట బీమా నమోదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి చేరవేస్తామంటున్నారు.

పంట బీమా పరిహారం చెల్లించి ఆదుకోవాలి

ప్రభుత్వం ఇన్స్యూరెన్స్ కంపెనీలతో చర్చించి వెంటనే ప్రతి రైతుకూ బీమా పరిహారమందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఏ సీజన్‌లో నష్టపోయిన రైతులకు, సీజన్ పూర్తి కాగానే పంట నష్టపరిహారంతో పాటు బీమా పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీఇచ్చారు. ఆచరణలో ఎక్కడా కనబడడం లేదు. గతేడాది జూన్‌లోనే పంట బీమా పరిహారం ప్రతి రైతుకూ అందిందని, ఈఏడాది వర్షాలు లేక విత్తిన విత్తనాలు ఎండ దెబ్బకు ఎండిపోయాయని రైతులు పేర్కొంటున్నారు. జూన్ నెల ముగియడానికి వస్తున్నా మంచి వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట బీమా పరిహారమందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బీమా పరిహారం జాబితా రాలేదు

- ఎఒ ఆనంద్

మా కార్యాలయానికి ఇంతవరకు పంట బీమా జాబితా రాలేదు. ఈఏడాది పంట బీమా పరిహారం జాబితాలో మండలం ఉందా లేదా అనే విషయం పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. జులై 8న పంట బీమా పరిహారంపై పూర్తి సమాచారం అందే అవకాశం ఉంది.

ఇన్స్యూరెన్స్ లేదు.. వర్షాల్లేవు

- పాల్తూరు గోవిందు, రైతు, హోళగుంద

గతేడాది అధిక వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు ఇన్స్యూరెన్స్ డబ్బులు ఇంతవరకు అందలేదు. ప్రస్తుతం వర్షాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇన్స్యూరెన్స్ డబ్బులు అందించి ఆదుకోవాలి.

పాఠశాల భవనాల ఏర్పాటు సరే..!

- ఉపాధ్యాయుల నియామకం మరిచారు...

ప్రజాశక్తి - ఆదోని

ప్రాథమిక విద్య అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతి చిన్నారికీ విద్యనందించే బాధ్యత పాలకులపై ఉంది. ఆ దిశగా సౌకర్యాలు కల్పించి విద్యాబుద్ధులు నేర్పించాలి. పాలకులు మాత్రం ఆ దిశగా దృష్టి సారించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు.

పాఠశాల భవనాలు సరే

పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీలో నాడు-నేడు కింద సుమారు రూ.కోటి వ్యయంతో భవనాల నిర్మాణం జరుగుతోంది. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు, సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు వెచ్చించింది. భవనాల మాట సరే కానీ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు ఏరి అన్న ప్రశ్న తలెత్తుతోంది.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించకపోవడంతో మెరుగైన విద్యకు దూరమవుతున్నామని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. పేద పిల్లల పట్ల చిన్నచూపు సమంజసం కాదంటూ పలువురు నినదిస్తున్నారు.

భవన నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న ప్రధానోపాధ్యాయులు

రోడ్డెక్కిన విద్యార్థులు

పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 6 నుంచి 10వ తరగతి వరకు హైస్కూల్ కొనసాగుతోంది. ఉపాధ్యాయులను నియమించాలని గతవారంలో పాఠశాల ముందు బైఠాయించి విద్యార్థులు ధర్నా చేశారు. 850 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులతోనే విద్యా బోధన చేస్తున్నారు. రెండేళ్లుగా ఇతర పాఠశాలలతో సమానంగా మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. ముగ్గురు సబ్జెక్ట్ టీచర్లతో పాటు ప్రధానోపాధ్యాయులు ఉన్నారని, వారితో మెరుగైన విద్యాబోధన కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్ల సమయం, నాడు-నేడు పనుల పరిశీలన తదితర పనులకు బోధనేతర సిబ్బంది లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయుల కొరతను తీర్చాల్సిన అవసరం ఉంది.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలని ధర్నా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఉపాధ్యాయులను వెంటనే నియమించాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలి. 850 మంది విద్యార్థులకు గాను ముగ్గురు టీచర్లతో బోధన ఎలా ఉంటుందో అధికారులు గ్రహించాలి. నాడు-నేడు కింద భవన నిర్మాణాలను స్వాగతిస్తున్నాం. అదే తరహాలోనే మెరుగైన విద్యనందించేందుకు ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులను నియమించాలి. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం.

ఉన్నతాధికారులకు నివేదించాం

- ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు

స్లమ్ ఏరియాలో హైస్కూల్ ఉండడం వల్ల ఇక్కడ చేరే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఉన్న ఉపాధ్యాయులతోనే సర్దుబాటు చేసుకుని మెరుగైన విద్యనందించే దిశగా కృషి చేస్తున్నాం. ప్రస్తుతం గదుల కొరత లేనప్పటికీ విద్యార్థులకు ఎలాంటి సమస్యలూ లేవు. ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉపాధ్యాయులను నియమించాలని ఉన్నతాధికారులను కోరాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

త్వరలోనే సర్దుబాటు చేస్తాం : ఎంఇఒ శివ రాములు

ఆర్ఆర్ లేబర్ కాలనీ హైస్కూల్‌లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించే దిశగా దృష్టి సారించాం. అక్కడ ఉపాధ్యాయులను త్వరలోనే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే సర్దుబాటు చేసి ఉపాధ్యాయుల కొరతను తీర్చుతాం.

మహిళా టీచర్‌పై అత్యాచారయత్నం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్‌పై కోసిగికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాలనీ మహిళల వివరాల మేరకు... ప్రభుత్వ పాఠశాలలో బాత్‌రూములు సరిగా లేకపోవడంతో మహిళా టీచర్ మధ్యాహ్న సమయంలో ఎప్పటిలాగే పాఠశాల వెనుక భాగంలోని ఓ ఇంటికి బాత్‌రూముకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన ఓ వ్యక్తి బాత్‌రూమ్ దగ్గరకు వెళ్లి మహిళా టీచర్‌పై అసభ్యకరంగా ప్రవర్తించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మరో 20 నిమిషాల పాటు మహిళా టీచర్‌ను పిడుగులు గుద్దుతూ మెడపైనా, ముఖంపైనా రక్తగాయాలు చేశారు. మహిళా టీచర్ గట్టిగా కేకలు వేయడంతో కొందరు మహిళలు ఆ వ్యక్తిని అడ్డుకోబోగా వారిపై కూడా దాడికి ప్రయత్నించాడు. అధిక సంఖ్యలో మహిళలు రావడంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. ఆ వ్యక్తి దాడిలో గాయపడిన మహిళా టీచర్ బోరున విలపిస్తూ ఎవరికీ చెప్పుకోలేక తోటి ఉపాధ్యాయురాలుతో కలిసి ఎమ్మిగనూరుకు ప్రత్యేక వాహనంలో వెళ్లిపోయారు. మహిళా టీచర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు, మహిళలు కోరారు. ఈ విషయంపై ఎస్ఐ రాజారెడ్డిని ఫోన్‌లో వివరణ కోరగా... కాలనీవాసుల సమాచారం మేరకు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, మహిళా టీచర్ ఫిర్యాదు చేస్తే విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నిందితుని శిక్షించాలి : ఉపాధ్యాయ సంఘాలు

నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్ కుమార్, ఎ.లక్ష్మీకాంత్ రెడ్డి ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు రాజమౌళి, అధ్యక్షులు భీమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓబులేసు కోరారు. కోసిగిలోనూ, వివిధ గ్రామాల్లోనూ మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు.

స్తంభించిన ట్రాఫిక్

- రంగంలోకి దిగిన సిఐ శ్రీనివాసులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ట్రాఫిక్ నియంత్రణకు సిఐ శ్రీనివాసులు రంగంలోకి దిగి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. గురువారం బక్రీద్ పండగ సెలవుదినం కావడం, తొలి ఏకాదశీ సందర్భంగా రాఘవేంద్రస్వామి వారి దర్శనార్థమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న ఆర్చీ నుంచి వాహనాలను లోపలికి పంపించకుండా నాగలదిన్నె దారి వైపు మళ్లించారు. దర్శనానంతరం భక్తులు వాహనాలు ఆర్చీ గుండా వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. అప్పటికే పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తూ వాహనాలను బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటు ఎమ్మిగనూరు వైపు నుంచి భారీ వాహనాలు రావడంతో కొంత సేపు సిబ్బందికి గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో సిఐ శ్రీనివాసులు స్వయంగా రంగంలోకి దిగి వాహనాలను నిలిపి వేసి ఒక్కో దిక్కు నుంచి బయటకు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో అటు గ్రామస్తులు, ఇటు పాదాచార భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. సెలవులు వచ్చాయంటే చాలు ఇదే సమస్య పునరావృతం అవుతోందని, సమస్య శాశ్వత పరిష్కారానికి శ్రీమఠం యాజమాన్యం చర్యలు తీసుకోవాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తున్న సిఐ

మళ్లీ వైపిపిని ఆశీర్వదించండి

- మున్సిపల్ చైర్మన్ శాంత, నాయకులు జయమనోజ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

వచ్చే 2024 ఎన్నికల్లో మళ్లీ వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ బోయ శాంత, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 36వ వార్డు బీరప్ప నగర్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. వారు ప్రతి గడపకూ తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. పాదయాత్రలో ప్రజలకు మాట ఇచ్చిన ప్రకారం నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలను 98 శాతం అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, ఆర్ఐ జయరామి రెడ్డి, నాయకులు ఉన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

అనారోగ్యంతో ఎల్లప్ప మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

సిపిఐ మండల కార్యదర్శి ఎల్లప్ప గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి మంత్రాలయం చేరుకొని ఎల్లప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంపురం రెడ్డి సోదరుల తరఫున తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, వెంకటరెడ్డి చేతులమీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతకుముందు సర్పంచి తెల్లబండ్ల భీమయ్య కూడా ఎల్లప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎల్లప్ప కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఫోన్‌లో భరోసా కల్పించారు. వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, గణదాళం దుల్లయ్య పాల్గొన్నారు.

'ఎల్‌వి.ప్రసాద్' ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - హోళగుంద

ఎల్‌వి.ప్రసాద్ నేత్రాలయ సౌజన్యంతో స్థానిక కన్నడ పాఠశాలలో ఆర్ఎంపి తిప్పయ్య నేతృత్వంలో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 50 మందికి పరీక్షలు చేశారు. 15 మంది ఆపరేషన్లు చేసుకోవాల్సిందిగా టెక్నీషియన్ జయలక్ష్మి, అసిస్టెంట్ టెక్నీషియన్ మల్లికార్జున సూచించారు. మిగిలిన 35 మంది తగిన అద్దాలు తీసుకుంటే సరిపోతుందన్నారు. ఆర్ఎంపి తిప్పయ్య మాట్లాడుతూ... పేద, ధనిక అనే తేడా లేకుండా కంటి పరీక్షలు చేయించుకుని జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా జరిగే పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపు కోఆర్డినేటర్ మాన్‌తీష్ పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని విద్యానగర్ గ్రామంలో ఉన్న ఎస్‌వికెవి పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల అపూర్వ సమ్మేళనం గురువారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతిలో జరిగిన తీపి గుర్తులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు పలుకరించుకుంటూ సరదాగా గడిపారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులకు వందనం చేస్తూ ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ఇన్‌ఛార్జీ లక్ష్మి కాంత్ మాట్లాడారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. 49 ఏళ్లుగా ఎయిడెడ్ పాఠశాలగా ఉండేదని, ఆ పాఠశాల ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలగా మారిందని తెలిపారు. వచ్చే సంవత్సరం జూన్ 24న 50 ఏళ్లు పూర్తి చేసుకుని సంబరాలు చేసుకుంటామని చెప్పారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు తగిన సహకారం అందించాలని కోరారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని, మళ్లీ ఇప్పుడు కలుసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ... ఎక్కడో ఉన్న విద్యార్థులందరూ 27 ఏళ్ల తర్వాత కలుసుకోవడం, బాల్యంలోని మధుర స్మృతులను గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మి రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రామ్మూర్తి, జానకి రామిరెడ్డి, రంగన్న, కేశవరెడ్డి, ఎన్‌టి.ఈరన్న, తండా సర్పంచి భారతమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పురుగు మందు తాగి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

పురుగు మందు తాగి వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం కోసిగిలో చోటుచేసుకుంది. మృతుని బంధువుల వివరాల మేరకు... కోసిగిలోని 9వ వార్డుకు చెందిన మంజెలి వడ్డే అయ్యన్న (75) కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడేవారు. భరించలేక బుధవారం అర్ధరాత్రి పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు అయ్యన్నను కోసిగి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కోసిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారాలను తగ్గించాలని, చార్జీలు బాదుడుకు నిరసనగా జరిగే ఆందోళనకు ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఇప్పటికే కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ప్రజల మద్దతుతోనే శుక్రవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. తిమ్మారెడ్డి బస్టాండ్ నుంచి ప్రదర్శన, విద్యుత్ డివిజనల్ కార్యాలయం ముందు వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'మోడల్'లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం : ప్రిన్సిపల్ రంగన్న

పెద్దకడబూరు : పెద్దకడబూరు ఎపి మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రంగన్న గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో 7, 8వ తరగతుల్లో ఒకటి చొప్పున, 9వ తరగతిలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల పిల్లల తల్లిదండ్రులు శనివారం సాయంత్రంలోపు మోడల్ స్కూల్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించి పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో గురువారం బక్రీద్ సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని 60 మసీదుల్లో నమాజ్ చేసినట్లు పట్టణం ఖతిబ్ సాబ్ జునేద్ హష్మి తెలిపారు. పట్టణంలోని షాహి జామియా మసీదు, పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలకు వేలాదిమంది ముస్లింలు హాజరయ్యారు. మసీదులో ఖతిబ్ సాబ్ జునేద్ హష్మి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. నమాజ్ అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఇంట్లో ముస్లింలు ఎమ్మెల్యేను సన్మానించారు. మండలంలోని పెద్దతుంబలం, పెద్ద హరివాణం, సంతేకుడ్లూరు, హానవాలు తదితర గ్రామాల్లో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. **హోళగుంద** బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు, పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో స్థానిక పెద్ద మసీదు నుంచి పురవీధుల్లో తిరుగుతూ ఆయా ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. హాలే హదీస్ ఈద్గాలో మౌలి హబీబుల్లా ముస్లింలతో ప్రార్థనలు చేయించారు. మౌల్వి సమీయుల ఈద్గాలో ముస్లింలనుద్దేశించి ఉపన్యసిస్తూ దేశ పౌరులందరూ కలిసిమెలిసి ఉండాలని, దేశ ఐక్యత కోసం అందరూ ఒకేతాటిపై నిలవాలని కోరారు. హిందూ, ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శాలి మసీద్ రాజా నగర్, పబ్లిక్ జమాత్ ఆధ్వర్యంలో బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు, నరేంద్ర, భారీ సంఖ్యలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. **దేవనకొండ**తో పాటు తెర్నేకల్, కోటకొండ, కరివేముల, ఎంకె.కొట్టాల, గుండ్లకొండ తదితర గ్రామాల్లో ముస్లింలు, పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బక్రీద్ పండగ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మసీదు నుంచి ముస్లింలు పురవీధుల వెంట ఆయా ఈద్గాలకు తరలి వెళ్లి నమాజ్ చేశారు. ఎస్ఐ భూపాలుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **చిప్పగిరి** బంబం స్వామి దర్గా దగ్గర ఖురాన్ విశిష్టతను ముస్లిం మతపెద్దలు వివరించారు. నేమకల్ గ్రామంలో రోడ్డు సమీపంలో ఉన్న ఈద్గా దగ్గర ముస్లింలందరూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. **పెద్దకడబూరు** గ్రామ శివారులో ఉన్న ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలతో కలిసి వైసిపి నేతలు పాల్గొన్నారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. **కోసిగి (రూరల్)**లోని ఉన్న రైల్వే గేట్ దగ్గర ఉన్న ఈద్గా వద్ద మండలంలోని ఆయా గ్రామాల ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానికంగా ఉన్న జామియా మసీద్, నూరాని సున్ని, మదీనా, మసీద్ ఏ అక్సా, అన్వరుల్లా ఫారూఖీ మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా ఈద్గా వద్దకు చేరుకున్నారు. హఫీస్ జీలాన్ బక్రీద్ గొప్పతనాన్ని వివరించారు. ఈద్గా ప్రాంగణంలో సర్పంచి అయ్యమ్మ, వైసిపి సీనియర్ నాయకులు మాణిక్యరాజు, యువ నాయకులు రాజేష్ ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు చేయించి నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ పార్థసారథి ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ఆదోనిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

హోళగుందలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

దేవనకొండలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చిప్పగిరిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న మత పెద్దలు

పెద్దకడబూరులో శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కోసిగి ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి

- ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఆదోని

ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్త, మిరియాల శ్రీధర్ కోరారు. గురువారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆపరేషన్లు చేసుకున్న 258 మంది రోగులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదలను ఆదుకోవాలని వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్ల క్యాంపులు మున్ముందు నిర్వహిస్తామన్నారు. శిబిరాల నిర్వహణకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని దాత నాగేష్ కాకుబాళ్ తెలిపారు. శిబిరాల నిర్వహణకు వేదికను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నందుకు కల్యాణ మండప కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వభారతి ఆస్పత్రి డాక్టర్ సురేష్, ఆవోపా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి, రంగనాయకులు, మహిళ విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు బూదూరు సంగీత, వంకదారు మమతా, సభ్యులు ప్రతాప్, హిమ బిందు, వంకదారు గీత, కవితశ్రీ, తులసి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

భీమ్ ఆర్మీ చీఫ్‌పై దాడి పిరికిపంద చర్య

- మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉత్తరప్రదేశ్‌లోని భీమ్ ఆర్మీ చీఫ్‌పై దుండగులు కాల్పులు జరపడం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి.రంగయ్య, జిల్లా నాయకులు మల్లేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మతోన్మాదం బుసలు కొడుతున్న ఉత్తరప్రదేశ్‌లో రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు, కుల అణచివేతను వ్యతిరేకించేందుకు 2015లో భీమ్ ఆర్మీని స్థాపించినట్లు తెలిపారు. ఈ సంస్థకు నాయకుడైన చంద్రశేఖర్ ఆజాద్ అనతికాలంలోనే దళితులను, బహుజనులను సంఘటిత పరిచి ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యర్థిగా మారారని తెలిపారు. అధికార బిజెపి తప్పుడు కేసులు బనాయించి జైలులో నిర్బంధినప్పటికీ వెన్నుచూపని ధైర్యం అతనిదని చెప్పారు. ఆజాద్‌పై జరిపిన కాల్పుల వెనుక అధికార పార్టీల హస్తం ఉంటుందన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌ను చంపితే వేలమంది చంద్రశేఖర్ ఆజాద్‌లు పుట్టుకొస్తారని హెచ్చరించారు. చంద్రశేఖర్ ఆజాద్‌కు జరగరానిది ఏమైనా జరిగితే ఆపై జరిగే పరిణామాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దోషులను పట్టుకోవడంలో, న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ధర్నాలు, రాస్తారోకోలతో దేశం అట్టుడుకుతుందని తెలిపారు. ఈ దాడిపై కార్యాచరణకు చర్చకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకుల నుంచి ఆహ్వానం అందిందని చెప్పారు. కార్యాచరణ మేరకే ముందుకెళ్తామని తెలిపారు.

'సంతానం లేనివారికి మెరుగైన పరీక్షలు'

ప్రజాశక్తి - ఆదోని

సంతానం లేనివారికి జులై 2న వాసవీ కల్యాణ మందిరంలో ఉచిత చికిత్స శిబిరం ఉంటుందని ఎన్ఆర్ఐ, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు నాగేష్ కాకుబాళ్ తెలిపారు. గురువారం ఎస్‌కెడి కాలనీ 3వ రోడ్డులోని 'వైట్ హౌస్'లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్య ఆఫీసియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా), అండ్ ఆవోపా మహిళా విభాగ్ సహకారంతో కర్నూలు ప్రైమ్ ప్లస్ ఫెర్టిలిటీ సెంటర్ వారి సౌజన్యం, తన సొంత ఖర్చులతో ఉచితంగా ఐవిఎఫ్ మెడికల్ కౌన్సెలింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవ చేయాలనే సంకల్పంతో గతంలో రెండు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలు సైతం పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని, సుమారు రూ.25 వేల విలువ చేసే వైద్యాన్ని ప్రతి జంటకూ అందిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో సుమారు 5 వేల కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 100 జంటలకు ఉచిత ఒపి, రిజిస్ట్రేషన్, స్త్రీ, పురుషులకు ఉచిత సలహాలు, రక్తపరీక్షలు చేసి వాస్తవ పరిస్థితులు వివరిస్తారని చెప్పారు. శిబిరానికి భార్యాభర్తలు తప్పక రావాలన్నారు. అర్హులకు వీర్య పరీక్షలు (సెమిన్ ఎనాలిసిస్), ఐయుఐ టెస్ట్, ఐవిఎఫ్ కన్సల్టేషన్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 8977778184, 9550444641, 9849478178, 9490576399, 9849057205 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

యువతతో బుగ్గన కార్యక్రమంలో మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి

ఎఫ్‌పిపిసిఎ బాదుడు

- ఒక్క నెలలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8.97కోట్లు - యూనిట్‌పై 40 పైసలు భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో వివిధ పేర్లతో సామాన్యులపై బాదుడు వేసింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో ఈ నెల నుంచి సామాన్యులపై విద్యుత్ బిల్లులో భారాన్ని మోపింది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. గత ఏడాది ఆగష్టు నుంచే తొలి విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండగా ఈ నెల నుంచి రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఒక్క నెలలోనే రూ.8.97 కోట్ల రూపంలో ఎఫ్‌పిపిసిఎ భారం వేసింది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 14,26,915 విద్యుత్ కనెక్షన్లు ఉండగా యూనిట్‌పై 40 పైసలు చొప్పున భారాన్ని మోపింది. 11,19,459 గృహ విద్యుత్ (ఎల్‌టి1) కనెక్షన్లు ఉండగా వాటిపై ఎఫ్‌పిపిసిఎ రూపంలో రూ.6.32 కోట్లు జూన్ నెల బిల్లులో వేశారు. 1,25,378 వాణిజ్య (ఎల్‌టి2) కనెక్షన్లు ఉండగా వాటికి రూ.1.13 లక్షలు, 7,630 పారిశ్రామిక (ఎల్‌టి3) కనెక్షన్లు ఉండగా వాటికి రూ.67.09 లక్షలు, 23,370 సాధారణ ప్రభుత్వ (ఎల్‌టి4) కనెక్షన్లు ఉండగా వాటిపై రూ.79.93 లక్షలు ఎఫ్‌పిపిసిఎ రూపంలో భారం పడింది. మరో వైపు ట్రూ అప్ రూపంలోనూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.3.43 కోట్లు విద్యుత్ వినియోగదారులపై భారం పడింది. గృహ వినియోగదారులపై రూ.2.31 కోట్లు, వాణిజ్య వినియోగదారులపై రూ.45లక్షలు, పారిశ్రామిక వినియోగదారులపై రూ.33.81 లక్షలు, ప్రభుత్వ సంస్థలపై రూ.31.69 లక్షలు ట్రూఅప్ భారం పడింది.

ప్రజలందరినీ కూడగట్టి ఆందోళనలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపైన విద్యుత్ భారాలు విపరీతంగా మోపుతోంది. పెరిగిన విద్యుత్ బిల్లుల వల్ల ఎవరికి చెప్పుకోవాలో తెలీని పరిస్థితిలో ఉన్నారు. ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్, సర్‌ఛార్జ్ వంటి వేరు వేరు పేర్లతో సామాన్యులపై భారాలు వేస్తున్నారు. దాంతో పాటు కేంద్రానికి తలొగ్గి స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు పూనుకుంటున్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలందరినీ కూడగట్టి ఆందోళనలు చేపడతాం.

- ఇ.పుల్లారెడ్డి,
పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు.

ప్రతిపక్షాలకు అభివృద్ధి కనపడలేదా..

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి

ప్రజాశక్తి -ప్యాపిలి

డోన్ నియోజకవర్గంలో టీడీపీ నాయకులకు అభివృద్ధి కనపడలేదా అని కండ్లు ఏమైనా మూసుకున్నారా అని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. గురువారం నాడు యువత కోసం బుగ్గన కార్యక్రమంనకు విచ్చేసిన మంత్రికి 200 బైకులతో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన టిడిపి నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ నాయకుడు యువగళం పేరుతో లోకేష్ చేసిన పాదయాత్రలో యువకులకు ఏమైనా హామీలు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా అన్నారు. యువత కోసం హుస్సేనాపురంలో గొర్రెల పెంపకం ట్రైనింగ్ సెంటర్, పాలిటెక్నిక్ కళాశాల చదువుకునే విద్యార్థులకు ప్రతి విద్యార్థికి తప్పకుండా ఉద్యోగం వస్తుందన్నారు. డోన్‌లో రూ.40కోట్లతో బీసీ హాస్టల్,ఎస్సిలకు పదవ తరగతి వరకు 400 మంది విద్యార్థులకు 30 కోట్లతో హాస్టల్,బేతంచెర్లలో40 కోట్లతో బీసీ బాలుర హాస్టల్ నిర్మిస్తున్న మన్నారు. డోన్‌లో ఐటిఐ నిర్మాణంలో ఉందన్నారు. కొత్త కోట వద్ద యువ కులకు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కేంద్రం, డోన్, ప్యాపిలిలో ఇండోర్ స్టేడియం, డోన్‌లో కియా నాలెడ్జ్ ఎక్సలెన్స్ సెంటర్,ప్యాపిలిలో రూ.50 కోట్లతో ఇంటిగ్రేడ్ మార్కెట్ దీని వల్ల చెన్నై, బెంగళూరు, బొంబాయి నగరాల నుంచి పూలు, పండ్లు రవాణాతో అనేక మందికి ఉపాధి లభిస్తుందన్నారు. డోన్‌లో వంద పడకల ఆసుపత్రి,ప్యాపిలి మండలంలో చెరువు లకు నీళ్లు రావడం వలన 20 ఊర్లకు సాగునీరు అంది, భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ వలన డిసెంబర్ కల్లా ప్రతి ఇంటికి కొళాయి ఫిల్టర్ నీళ్లు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ మీట్ చైర్మన్ శ్రీరాములు, ప్యాపిలి జడ్పిటిసి శ్రీరామ రెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి, పుల్లారెడ్డి, సీమ సుధాకర్ రెడ్డి,దిలీప్ చక్రవర్తి, మెట్టు వెంకటేశ్వర రెడ్డి,బోరెడ్డి రాము, రామచంద్రారెడ్డి,కమతం భాస్కర్ రెడ్డి,భువనేశ్వర్ రెడ్డి, క్రిష్ణరెడ్డి, బోరా మల్లికార్జునరెడ్డి,రాజా మురళి, బాలయ్య,మస్తాన్ ఖాన్, రెడ్డి, నిజాముద్దీన్, కొండయ్య, సాగర్, విగ్గు, రఘు,షాషా,పాండు, పెద్దిరాజు, అంజి పాల్గొన్నారు.

సోదర భావంతో.. బక్రీద్

ఆళ్లగడ్డలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉన్న చిన్నారులు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలో బక్రీద్ పండంగ నిరాడంబరంగా, శాంతియుతంగా ముగిసింది. ఉదయం ఆరున్నర గంటల నుండి తొమ్మిదిన్నర గంటల వరకు అరవైకు పైగా వివిధ మస్జిద్‌ల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈద్ నమాజ్ ఆచరించారు. మస్జిద్ లలో అయా ఇమాములు ఈద్ నమాజ్ నిర్వహించారు. జామియా మస్జిద్ లో హాఫీజ్ ఇర్ఫాన్, అల్ఫుర్ ఖాన్ మస్జిద్‌లో హాఫీజ్ హాది,ఖసాబ్ మస్జిద్ లో హాఫీజ్ ఇసాక్,మాల్దార్ పేట్ లో హాఫీజ్ ఫైరోజ్, ఖిజర్ మస్జిద్ లో మునవ్వర్, కుబ్రా మస్జిద్ లో హాఫీజ్ అమ్జద్ బాషా సిద్దీఖీ, మస్జిద్ రసూల్ లో హాఫీజ్ ముహమ్మద్ సలీం పర్వేజ్, నూరానీ మస్జిద్ లో మౌలానా అబ్దుల్లా బాఖవి, సిద్దీఖీ మస్జిద్ లో హాఫీజ్ ముహమ్మద్ ఆజం నమాజ్ చేయించారు.ప్రజలకు సుఖశాంతులు ప్రసాదించమని ప్రార్థించారు. **చాగలమర్రి :** మండలంలో ఈదుల్ జూహా (బక్రీద్) ముస్లిం సోదరులు ఆనందోత్సాహాలతో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని మసీదులు,ఈద్గాలు ప్రత్యేక ప్రార్థన లతో మార్మోగాయి. ఈ సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ యూనస్ త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని తెలిపారు. స్థానిక అడ్డవాగు సమీపంలోని యూసుఫ్ మజీద్ లో మౌలానా అబ్దుల్ మజీద్, నూరాణి మజీద్‌లో ముస్లిం ఈద్గా ప్రార్థనలు నిర్వహిం చారు. ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇన్‌చార్జ్ సిఐ రమేష్‌బాబు, ఎస్ఐ రమణయ్య బందోబస్తు నిర్వహించారు. **పగిడ్యాల:** మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గ్రామ శివారులో ఉన్న ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం జంతువులను జుబా చేసి కబాని ఇచ్చి పేదలకు పంచిపెట్టారు. **ఆళ్లగడ్డ:** మండలంలో బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో ముస్లిం సోదరులు దివ్యజ్ఞాన మందిరం నుంచి సామూహికంగా లింగం దిన్నె రోడ్డులో ఉన్న ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సాదిక్ బక్రీద్ పండగ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈద్గా వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. **ఆత్మకూర్:** ఆత్మకూరు మండలంలో బక్రీద్ పర్వదిన వేడుకలు తొలి ఏకాదశి వేడుకలు గురువారం నాడు ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకున్నారు. ముస్లిం సోదరులు త్యాగానికి గుర్తుగా జరుపుకునే బక్రీద్ వేడుకల సందర్భంగా ఈద్గాల వద్ద మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలి ఏకాదశి వేడుకల సందర్భంగా హిందువులు పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు అధికారులు పట్టణంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

తరువాయి 6లో..

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, తదితరులు

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

- ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎస్పీ, ప్రముఖులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగ రోజున రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని భీమవరం రోడ్డులో గల పాత ఈద్గా నందు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామున్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ బాషా పాత ఈద్గా మసీదు కమిటీ చైర్మన్ మన్ ఇయర్ ఖలీల్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లింగేశ్వరరావు, నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ కోశాధికారి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ బాష, నంద్యాల మండల సబ్ బ్రాంచ్ వైస్ చైర్మన్ సోహెల్, డీఎఫ్ఓ రాజు నాయక్, రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్స్ సద్దాం, బాబా, దాదా, మురళి హుస్సేన్ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీక అయినా పవిత్ర బక్రీద్ పండగ రోజున త్యాగానికి ప్రతి రూపంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సంస్థను అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరితో పాటు ఆయన కుమారులు దాదాపు 20 మందికి పైగా ముస్లిం యువకులు రక్తదానం చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం పునర్నిర్మాణ అభివృద్ధికి, ఆలయ విమాన గోపురంనకు, విగ్రహాల ఏర్పాటుకు 2 లక్షలు రూపాయల చెక్కును మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ బి రామచంద్రుడు కుమార్తె జోష్ణ ఆలయ ఈవో పాండురంగారెడ్డికి గురువారం అందజేశారు. ఆలయ చైర్మన్ దంపతులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భూమి పూజ చేస్తున్న మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి

బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని బీరవోలు గ్రామం సమీపాన కేసి కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి మాట్లాడారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధారెడ్డి సహకారంతో కేసి కెనాలపై బ్రిడ్జి నిర్మాణానికి రూ 1.50 కోట్ల వ్యయంతో భూమి పూజ చేసినట్లు ఆయన తెలిపారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పగిడ్యాల మండలంతో పాటు నందికొ ట్కూరు నియోజవర్గాన్ని ఎంతగానో అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రబ్బానీ బ్రదర్స్ ఆధ్వర్యంలో బక్రీద్ విందు

- హాజరైన ఎమ్మెల్యే ఆర్థర్, ప్రముఖులు

ప్రజాశక్తి - నందికొట్కూరు

బక్రీద్ పండుగ పర్వదినాని పురస్కరించుకొని మున్సిపల్ వైస్-చైర్మన్ మొల్ల రబ్బానీ,కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ వారి స్వగృహంలో ఎమ్మెల్యే ఆర్థర్‌కు పట్టణ ప్రముఖులకు, అధికారులకు విందు ఏర్పాటు చేశారు. రబ్బానీ బ్రదర్స్ ఆహ్వానం మేరకు గురువారం ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రబ్బానీ బ్రదర్స్ కు ఆత్మీయ కౌగిలితో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతిథి ఎమ్మెల్యే అర్థర్ కు విచ్చేసిన అధకారులకు , నాయకులు ముస్లిం సంప్రదాయ కరమైన రుచికరమైన వంటకాల తో విందును ఇచ్చారు. సీఐ సుధాకర్ రెడ్డి,ఎస్సై ఎన్వి రమణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విందులో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు, వైసీపీ నాయకులు

మల్లన్నకు సహస్ర ఘటాభిషేకం

ప్రజాశక్తి - శ్రీశైలం

సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని శ్రీశైల క్షేత్రంలోని మల్లికార్జున స్వామికి గురువారం నాడు తొలి ఏకాదశి పురస్కరించుకొని సహస్ర ఘటాభిషేకం సంప్రదాయబద్ధంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి నదీ జలంతోనే ఆలయ ప్రాంగణంలోని మల్లికా గుండంలోని జలంతోను ఘటాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణి రెడ్డి దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభం రోజున 27వ తేదీన ఐదు రకాల పారాయణులు పంచాక్షరి జపం నిర్వహించారు. 29వ తేదీ ఉదయం పూజలు అనంతరం రుద్ర హోమం నిర్వహించారు రాష్ట్ర మంత్రులు స్థానిక ఎమ్మెల్యే అధికారులు ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సభ్యులు కలిసి కృష్ణార్జున జలాలతో గ్రామ దేవత అంకాలమ్మకు అభిషేకం నిర్వహించారు. అనం తరం మల్లన్నకు కృష్ణానది జలాలతో మల్లికా గుండం జలాలతో ఘటాభి షేకం నిర్వహించారు. ఘటాభిషేకం సందర్భంగా గర్భాల ద్వారానికి మూడు అడుగుల ఎత్తు గోడను కట్టి జలముతో నింపి జలములో మల్లికార్జున స్వామిని ఉంచడం జరిగింది. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున కట్టిన మూడు రోజుల గోడను తీసివేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి దర్శనానికి యధావిధిగా అనుమతిని ఇవ్వడం జరుగుతుంది.

స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే శిల్పా

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలోని భ్రమ రాంబ మల్లికార్జున స్వామి వాళ్లను శ్రీశైలం శాసనసభ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి గురువారంనాడు దర్శించుకున్నారు. దర్శనార్థమై ఎమ్మెల్యే ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా ఆలయ అధికారులు సంప్రదాయపదంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవారు దర్శించుకున్నారు. ఆ తర్వాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితులు వేద ఆశీర్వచనం పలుకుగా శేష వస్త్రాలు ప్రసాదాలను జ్ఞాపకం ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు అందజేయడం జరిగింది అని ఆలయ అధికారులు తెలిపారు

కిక్కిరిసిన ఆలయాలు

మహానందిలో పూజలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - మహానంది

ఆలయ కార్యనిర్వ హణాధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహానంది క్షేత్రంలో తొలి ఏకాదశి పూజలను నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఒకరోజు ముందుగానే బుధవారం ఆలయ శుద్ధి చేశారు. శాస్త్ర యుక్తంగా వేద మంత్రాలు మంగళ వాయిద్యాల మధ్య క్షేత్రంలో పూజలు నిర్వహించారు. స్వామి అమ్మ వార్ల దర్శనార్థమై సుదూర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు వచ్చి దర్శనాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి దంపతులు, వేద పండితులు రవిశంకర్ అవధాని, శాంతారామ్ భట్, నాగేశ్వర శర్మ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని లలిత సుందరేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించకుని లలిత సుందరేశ్వర స్వాముల వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. భగవద్గీత పారాయణం చేశారు. ఈసందర్భంగా ప్రసాద వితరణ గావించారు. ఈకార్యక్రమంలో స్వర్ణ గౌరి,సూర్య నారా యణ రెడ్డి కుటుంబ సభ్యులు, నారాయణ రెడ్డి, కదిరిరెడ్డి, నాగేశ్వర రెడ్డి, వెంకటయ్య బయపరెడ్డి,రమేష్, అర్చకులు నరసింహ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలో తొలి ఏకాదశి పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రజల అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చాగలమర్రి : మండలంలోని ప్రజలు తొలి ఏకాదశి పండుగ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో గురువారం నిర్వహించారు. తొలి ఏకాదశి పురుష్కరించుకొని మహిళలు ఉపవాసం ఉండి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగలమర్రి పట్టణంలోని షిర్డి సాయినాధ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

1 నుండి కొలిమిగుండ్లలో గడప గడపకు..

- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

జూలై 1వ తేదీ నుండి మండలలోని పలు గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గడపగడపకు కార్యాక్రమంలో.. బనగానపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ వై.పాపిరెడ్డి, కొలిమిగుండ్ల మండలం అధ్యక్షురాలు కారాపాకుల నాగవేణి, వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. 1న ఉదయం 9 గంటలకు నందిపడు గ్రామా పంచాయతీలో, 2న సాయంతరం 3.00 గంటలకు కల్వట్ల గ్రామాల్లో పర్యటించునున్నారని తెలిపారు. యం.పి.టి.సి. సభ్యులు, సర్పంచులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

నేడు ప్రాధాన్యత భవనాలు ప్రారంభం

- హాజరు కానున్న మంత్రి బుగ్గన

ప్రజాశక్తి-డోన్

మండలంలోని యు కొత్తపల్లి గ్రామ సచివాలయం,హెల్త్ సెంటర్ ను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని డోన్ మండల ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రూ. 40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.17.5 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌లను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. డోన్ పట్టణ, మండల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో

సిమెంట్ బెంచీలు ఏర్పాటు

ప్రజాశక్తి-డోన్

ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం ఐదు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ శాంతి తెలిపారు. గురువారం డోన్ పట్టణంలోని ఆంజనేయస్వామి కొండకు భక్తులు వస్తుంటారని,వారు దర్శనం అనంతరం సేద తీరేందుకు ఇన్నర్ వీల్ క్లబ్ తరపున రూ.15000 విలువచేసే ఐదు సిమెంట్ బెంచిలు రాజకుమారి, భాస్కరశర్మ,ఉమగణేశన్ ఆర్థిక సహకారంతో అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ శాంతి మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగపడే సేవలు చేసినందుకు రాజకుమారి,భాస్కరశర్మ,ఉమగణేశన్ లను అభినందించారు. అడిగిన వెంటనే సహకారాం అందించినందుకు దాతలకు ఇన్నర్ వీల్ క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు ముడియాల శైలజరెడ్డి , శకుంతల రెడ్డి,విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాతలు అందించిన సిమెంటు బెంచీలను కొండపై ఏర్పాటు చేసిన ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు

ఎంపీ పోచ ఎమ్మెల్యే కాటసానులకు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

కాకునూరులో సీతారాముల విగ్రహ ప్రతిష్ట

- హాజరైన ఎంపి పోచ, ఎమ్మెల్యే శిల్పా, ప్రముఖులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

మండలంలోని కాకునూరు గ్రామంలో నూతనంగా వెలసిన సీతారాముల విగ్రహ ప్రతిష్ట గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త దేరిడి పరమేశ్వర్ రెడ్డి, మాజీ విఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు శివనాగిరెడ్డి, సర్పంచ్ నర్వ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిలు మాట్లాడుతూ దైవ కార్యాలలో తాము ఎప్పుడు పాల్గొంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రాంరెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతిక బక్రీద్ : బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

త్యాగానికి ప్రతిక బక్రీద్ పండుగ అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ముస్లిం సోదరులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిని కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ ప్రజలందరి మధ్య సోదర భావం వెల్లివిరుస్తున్న వేళ త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్ అన్నారు. బక్రీద్ పండుగ సమస్త మానవాళికి శాంతి చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ పురానుద్దీన్ టిడిపి నాయకులు అన్వర్ సాహెబ్, టిప్ టాప్ కలాం, అల్తాఫ్ హుస్సేన్ , హమ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు."బక్రీద్ "పండుగ పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరా, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి లు వారి నివాసానికి వెళ్లి బక్రీదు శుభాకాంక్షలు తెలిపి బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు. రాయలసీమ సలాం కుటుంబ సభ్యులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు కేక్ కట్ చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, అల్తాఫ్ ,కలాం హాజీ, హర్షత్, షేక్షావలి ,నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనార్దన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం సోదరులు

వీధి రోడ్లకు మోక్షం ఎప్పుడు?

- గడప గడపకు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులకు చెప్పిన స్పందన కరువు
- కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు వాపోతున్న లెక్క చేయని అధికారులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో అవసరమైన చోట డ్రైనేజీ సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటే.. ఒక ఇల్లు ఒక షాపు కూడా లేని ఆటో నగర్ లో 34 లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్లు వేసి కాంట్రాక్టర్లకు ఆర్థిక వనరులను సేకరించిన మున్సిపాలిటీగా ఆత్మకూరు ఉంటున్నదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అర్బన్ కాలనీలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్న సందర్భంగా కాలనీవాసులు సిసి రోడ్డు వేయాలని కోరినప్పటికీ రోడ్డు వేస్తున్నామని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే మాట కూడా చెల్లుబాటు కాలేదు. ఈమాట చెప్పిన ఎమ్మెల్యే రెండు నెలలు అవుతున్న ఇంతవరకు అర్బన్ కాలనీలో సీసీ రోడ్డు కాదు కదా కొద్దిపాటి వర్షానికి జలమయం అవుతున్న.. ఈ కాలనీలో వర్షపు నీటి కూడా మున్సిపాలిటీ అధికారులు తొలగించడం లేదు. గత మున్సిపాలిటీ సమావేశంలో సుల్తాన్ అనే కౌన్సిలర్ తమ తండ్రి కౌన్సిలర్‌గా ఐదు సంవత్సరాలు పదవీకాలం అయిపోయి ప్రస్తుతం తాను కౌన్సిలర్‌గాఉన్నప్పటికీ గత ఏడు సంవత్సరాల నుండి తమ కాలనీలో సీసీ రోడ్డు వెయ్యాలని ప్రతి కౌన్సిల్ సమావేశంలో అడుగుతున్న ఎందుకు రోడ్డు వేయడం లేదని అధికారులు నిలదీసిన పనులు జరగడం లేదని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. మరికొందరు కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలను అజెండాలో చేర్చాలని అధికారులకు కోరినప్పటికీ సమావేశానికి హాజరైన నాటికి వారు కోరిన పనులు అజెండాలో లేకపోవడం పట్ల నిరసన కార్యక్రమాలు సైతం చేసేందుకు సిద్ధమవడం జరుగుతోంది. ఈ సమావేశాల సందర్భంగా తయారయ్యే అజెండా చైర్మన్‌తో

ఒక షాపు ఇల్లు లేని చోట 34 లక్షల రూపాయలతో వేసిన గ్రావెల్ రోడు)

పాటు కౌన్సిలర్లు సూచనలకనుకూలంగా ఉండవలసిన అజెండాను అధికారులు తారుమారు చేస్తున్నారా అన్న అనుమానాలు కౌన్సిలర్ వ్యక్తపరుస్తునారు. అధికారులు స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లి ఆయన చెప్పిన విధంగానే అజెండాలో మార్పులు జరుగుతున్నట్టు కౌన్సిలర్లు కొందరు బహిరంగంగానే గుసగుసలాడుతు న్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులలో కూడా కౌన్సిలర్లు సమస్యలను పరిష్కరించలేని దిశలో ఉన్నట్లు సమావేశంలోనే వారు తమ ఆవేదనను చైర్మన్ దృష్టికి తీసుకొస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కొద్దిపాటి వర్షం వచ్చిన పలు కాలనీలో డ్రైనేజీ లేకపోవడం తో రోడ్లలో నీరు నిలబడి

కొద్దిపాటి వర్షానికి జలమయమవుతున్న వీధి

ప్రజలకు అంటువ్యాధులకు ఆ వర్షపు నీరు తయారవుతున్నదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. సమస్యలు పరిశీలించిన కానప్పుడు కౌన్సిల్ సమావేశానికి ఎందుకు రావాలని పలువురు కౌన్సిలర్లు మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశానికి హాజరవుతు న్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో నివాసముంటున్న ప్రజలు చెత్త పన్ను ఇంటి పన్ను నీటి పన్ను చెల్లిస్తున్నప్పటికీ ఆ కాలనీలో నెలకొని ఉన్న డ్రైనేజీ, సిసి రోడ్ల సమస్యలను పరిష్కరించే దిశగా అజెం డాలో వాటిని పొందుపరచకపోవడం ఒక భాగం అయితే. మున్సిపాలిటీ నిధులు స్మశాన వాటికలో సిసి రోడ్లకు కాంపౌండ్ గోడల నిర్మాణానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు న్యాయమని పట్టణ ప్రజలు బహిరంగంగానే ప్రజా ప్రతినిధుల తీరు పట్ల విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీలోని అవసరాల రీత్యా కాలనీలను గుర్తించి ఆ వార్డులలో అభివృద్ధి పనులు చేపడతారని ప్రజా ప్రతినిధులు ఆ దిశగా పని చేయాలని ప్రజలు కోరుతున్నారు.

1న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో తిరుమల పునీత్ ఆసుపత్రి నిర్వహణలో జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరిం చుకొని ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డాక్టర్ వి సత్యనారాయణ జ్ఞాపకార్థం జూలై 1వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి నంద్యాల సంజీవనగర్ గేట్ సమీపంలో వున్న తిరుమల పునీత్ ఆసుపత్రి ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇదే శిబిరంలోనే ఉచిత వినికిడి పరీక్షలు కూడా నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని నంద్యాల పట్టణం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభిస్తారని తెలిపారు.

వైసిపి కార్యాలయంలో బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బక్రీద్ వేడుకలను వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నిర్వహిం చారు. ముస్లిం సోదరి,సోదరులకు వైసిపి వినాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి ఈద్ ముబారక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ నాయకులు అత్తార్ జాహిద్ హుస్సేన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు మధు కుటుంబానికి భరోసా నిచ్చిన సెవెన్ హిల్స్ ఎండి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణానికి చెందిన సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండి మారుతి కుమార్ జర్నలిస్టు మధు కుటుంబానికి భరోసాగా నిలిచారు. మారుతి కుమార్ ఇచ్చిన మాట నిలుపుకు న్నారు. మృతి చెందిన జర్నలిస్టు మధు కుటుంబానికి రెండో సంవత్సరం హెల్త్ కార్డు రెన్యువల్ చేసి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఈ సందర్భంగా మారుతీ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సెమి హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జి విజయకుమార్, డాక్టర్ బోరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ క్రాంతి కిరణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సోదరభావంతో.. బక్రీద్

బనగానపల్లె: మండలంలో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. అన్ని మసీదులు,ఈద్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పట్టణంలోని ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ ప్రసంగించారు. సిఐ తిమ్మారెడ్డి,ఎస్ఐలు రామిరెడ్డి వీరాంజనేయులు ,పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. **రుద్రవరం:** మండలం కేంద్రంతోపాటు పలు గ్రామాలలో గురువారం నాడు ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేసుకున్నారు. మత గురువు మాట్లాడుతూ ఇస్లాం మతం లోని ఐదు ప్రధాన సూత్రాలలో ఒకటైన హజ్ తీర్థయాత్రను ముస్లింలు చేయవలసి

చాగలమర్రి : బోధిస్తున్న మౌలానా అబ్దుల్ మజీద్

నంద్యాల : ప్రత్యేక ప్రార్ధన నిర్వహిస్తున్న దృశ్యం

ఉంటుందన్నారు. ఈ మాసం ప్రారంభంలోనే ముస్లిం ప్రజలు భక్తి ప్రపత్తులతో హజ్ తీర్థయాత్రకు బయలుదేరతారు అన్నారు. సాంప్రదాయం ప్రకారం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు వారికి తోచిన విధంగా ఖుర్బానీ ఇవ్వాలి అన్నారు. **పాములపాడు:** మండలంలో బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లిం సోదరులందరూ ఈద్గాల దగ్గరికి వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు అలింగణం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **సంజామల :** మండలంలోని అన్ని గ్రామాలలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. భక్తి శ్రద్ధలతో ఈద్గాల వద్ద ప్రార్ధనలు చేశారు.

పాములపాడు : ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం : ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తున్న దృశ్యం

మహానందీశ్వరుడి సహస్ర ఘటాభిషేకానికి

ముందుకు రాని దాతలు..

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలో సహస్ర ఘటాభిషేక కార్యక్రమానికి దాతలు ముందుకు రావడంలేదని సమాచారం. శ్రీశైలం క్షేత్రంలో లోక కళ్యాణార్థం సహస్ర ఘటాభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా సాధారణంగా అధికారికంగా కానీ అనధికారికంగా దాతల ద్వారా కానీ సహస్ర ఘటాభిషేకం కార్యక్రమం ప్రధాన ఆలయాల్లో నిర్వహించడం జరుగుతుండేది. ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల వర్షాలు పడి సుభిక్ష వాతావరణం ఏర్పడుతుందని ప్రసిద్ధిగాంచిన ప్రధాన ఆలయాల్లో చేపట్టడం జరిగేది. కానీ దీనిని మహానంది క్షేత్రంలో దాతలు ఎవరు ముందుకు రావకపోవడంతో విస్మరించినట్లు సమాచారం. పాలక మండలికి కూడా ఇలాంటి కార్యక్రమాలపై అవగాహన లేకపోవడంతో ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దాతలకు క్షేత్రంలో అధికారుల నుండి సరియైన విలువలు,సహకారాలు ఇవ్వకపోవడంతో ముందుకు రావడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఆలయం నుండి నిధులు విడుదల చేసి జరిపించవచ్చు కానీ అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారనేది తెలియ రావడం లేదు. లోక కళ్యాణార్థం జరిగే కార్యక్రమాలు నిర్వహించకపోవడం ఏమిటని పలువురు భక్తులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

ఘనంగా స్వాతి వేడుకలు

- శ్రీ ప్రహ్లాద వరదులకు గరుడోత్సవం - ఉత్సవమూర్తులకు జ్యేష్టాభిషేకం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిల క్షేత్రంలో ప్రహ్లాదవరదులకు ఆణి స్వాతి సందర్భంగా జ్యేష్టాభిషేకం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందం ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మ వార్లతో పాటు సుదర్శన మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేద పండితులు వేద మంత్రాలు నడుమ జ్యేష్టాభిషేకం నిర్వహించారు. 108 కళాశాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. ఈ స్వాతి నక్షత్రం సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. తెల్లవారుజామునుండే కాలినడకన నల్లమల అరణ్యంలో వెలసిన నవనారసింహలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అహోబిలేశ్వరులను గరుడ వాహనంపై ఆసీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

బనగానపల్లె : పట్టణంలోనే రవ్వలకొండ మీద ఉన్న శ్రీ లక్ష్మీ పావన నరసింహ స్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీ పావన లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పావన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని గని గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ మధు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యుత్ కాంట్రాక్టర్ కార్మికుల 3045 యూనియన్ రాష్ట్ర నాయకులు శరత్ కుమార్ గురువారం మృతునీ కుటుంబాన్ని పరామర్శించారు. కారుణ్య నియామకం కింద మృతుని భార్యకు ఉద్యోగం వస్తుందన్నారు. గతంలో కారుణ్య నియమాక ఉత్తర్వులకు పలు నిబంధనలు ఉండే వన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి. అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించిఎలాంటి అడ్డంకులు లేకుండా కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వడానికి ప్రభుత్వం స్పందించడం సంతోషకరమన్నారు. అలాగే మృతనికి రావలసిన బెనిఫిట్స్ వచ్చేటట్లు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డివిజన్ ప్రెసిడెంట్ గోపాల్. కరీం. కృష్ణమూర్తి. మద్దిలేటి. సుధాకర్. రాఘవరెడ్డి. శ్రీరాములు. రామంజి. ఈశ్వరయ్య. నాగ శేషులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

అనారోగ్యంతో మరణించిన పట్టణంలోని దుర్గపేట కాలనీ నివాసి బూసి నాగ పెద్ద తిమ్మయ్య (68) కుటుంబానికి టిడిపి నేతలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం నాడు స్థానిక వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు కౌన్సిలర్ నంద్యాల మధు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గూటం శివ, ఆధ్వర్యంలో రూ.5000 మృతుని భార్య నాగలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, 16 వార్డు కౌన్సిలర్ రామ్ గోపాల్, శ్రీపతి నాగరాజు, కానాల అంజి, కోట్ల గోరంట్ల, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

మద్యం తాగి దర్శనానికి వస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - మహానంది

మద్యం సేవించి ఆలయంలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్సై జి. నాగేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. మద్యం సేవించి మహానంది ఆలయంలోకి ప్రవేశించిన ఐదు మందిని గురువారం అదుప ులోకి తీసుకొని,మద్యం సేవించి వున్నారని నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి ఆలయాలకు రావడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఆలయ ముఖ ద్వారం వద్ద బ్రీత్ అనలైజర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు.

ఆదర్శనీయుడు ఏకలవ్యుడు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని సుంకులమ్మ గుడి దగ్గర ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని సుంకు లమ్మ గుడి వద్ద ఏపీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి ఈసారి కుమార్ ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, పాలు వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈసారి కుమార్ మాట్లాడుతూ ఏపీ ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఎరుకలి కులస్తులకు కొంతమందికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎరుకల సేవా సంఘం మండల అధ్యక్షులు ఈసారి పెద్దరాముడు,జిల్లా ఉపాధ్యక్షులు విఘ్నేష్, మండల ప్రధాన కార్యదర్శి కె ప్రతాప్, నాయకులు శ్రీరాములు, పాముల రాముడు, ఈసారి శ్రీనివాసులు కాలింగిరి పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ : ఆత్మకూరు పట్టణంలో ఏపీ ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం నాడు ఏకలవ్యుడు జయంతి వేడుకలను స్థానిక ఎరుకలపేట వీధిలో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఏకల వ్యుడు చిత్రపటానికి పూలమాల వేసి ఇవాళ అర్పించారు. ఈ కార్యక్ర మంలో ఆ సంఘం నాయకులు హరిబాబు, మద్దిలేటి, 20వ వార్డు కౌన్సిలర్ రంగస్వామి, కేశవులు, శైలజ, సులోచన, పుల్లయ్య తదితరులు మాట్లాడారు. ఏ కష్టం వచ్చినా సంఘం ఆదుకునే దిశగా ఎరుకల పేటకు చెందిన కలిసి ఉండాలని అన్నారు.

ఆత్మకూర్ : ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

నంద్యాల కలెక్టరేట్ : ఏపీ ఎరుకల సేవా సంఘం నంద్యాల జిల్లా నివర్తి నగర్ లో ఏకలవ్య జయంతి ని ఘనంగా నిర్వహించారు.గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుండి నివృర్తి నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ జయంతికి రాష్ట్ర సలహాదారులు కోవెలకుంట్ల సుబ్బరాయుడు అదేవిధంగా రాష్ట్ర సెక్రెటరీ రామచంద్రుడు, రాయలసీమ అధ్యక్షులు సూర్యుడు, నంద్యాల జిల్లా అధ్యక్షులు రామలింగడు, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున, జిల్లా సెక్రెటరీ కృష్ణ, జమ్ములయ్య, డీలర్ సుంకన్న , సిరివెళ్ల మండల అధ్యక్షులు హాజరు అయ్యారు. ఈ జయంతిని ఘనంగా ర్యాలీతో పురవీధులలో తిరిగారు.అందుకు ఏకలవ్య వారసులమైనటువంటి ఎరుకల జాతి బిడ్డలు ఆనందం వ్యక్తం చేసినట్లు రాష్ట్ర సెక్రెటరీ రామచంద్రుడు తెలిపారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న ఏపీ ఎరుకల సేవా సంఘం నాయకులు

ఏకలవ్య జయంతి జరుపుకుంటున్న ఎరుకల సంఘం నాయకులు